క్లుప్తంగా

మొలంగూర్ ఖిల్లాను పర్యాటక కేంద్రం చేయాలి

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ ఖిల్లాను పర్యాటక కేంద్రం చేయాలని ఢిల్లీలో కేంద్ర పర్యాటకశాఖ డైరెక్టర్ ఎస్‌వీర్‌సింగ్‌కు బీసీ ఆజాదీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ గురువారం వినతిపత్రం అందించారు. సంరక్షణ లేక ఖిల్లా అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. జాతీయ వారసత్వ సంపదగా గుర్తించాలని కోరారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ కదలి రావాలని కోరారు. అన్ని నియోజకవర్గాల కంటే ఎక్కువ మంది హాజరై హుజూరాబాద్ సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుందని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండారెడ్డి,నాయకులు తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ఫైర్ సేఫ్టీ గురించి వివరిస్తున్న అధికారులు

మానకొండూర్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని మానకొండూర్ ఫైర్ ఆఫీసర్ భూదయ్య అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఫైర్ సెఫ్టీ గూర్చి వివరించడంతోపాటు వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సల్మాన్, సీహెచ్‌వో రాజునాయక్, హెల్త్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గురువారం భవన నిర్మాణ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. 21, 22వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాల్గో మహాసభ జరుగుతుందని భవన నిర్మాణ కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సదానందం, లక్ష్మణ్, పరమేశ్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న దూబాల శ్రీనివాస్

గన్నేరువరం: హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రం గురువారం పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. బూత్ స్థాయి నియామకాల ప్రక్రియ పూర్తి చేయాలని, స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా ముందుకుసాగాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో ఏలేటి చంద్రారెడ్డి, విలాసాగరం రామచంద్రం, బద్దం అనంతరెడ్డి, చంద్రయ్య, బాలరాంరెడ్డి, అటికం రామచంద్రం, బండి తిరుపతి, గట్టు కిషన్, బుర్ర సత్తయ్య, బోయిని మల్లయ్య, లక్ష్మీపతి, కుర్ర హరీష్, నందికొండ సురేందర్ రెడ్డి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, సాయి గణేష్, గౌతమ్, వేణు, ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశించినా పట్టింపులేదాయే?

- శివరాంపల్లిలో తాగునీటికి తంటాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- పనిచేయని చేతిపంపు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



గ్రామంలోని నల్లాల బావిలో అడుగంటిన నీరు



పనిచేయని చేతిపంపు

సైదాపూర్: వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించినా పంచాయతీ అధికారులు మాత్రం అదేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండలంలో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా మహిళలు బిందెలు పట్టుకొని రోడ్డెక్కితే పంచాయతీ అధికారులు, సర్పంచులదే బాధ్యతని గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికి పైపులైన్ వేసినా సరిగా నీరు రావడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడం లేదని, క్షేత్ర స్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సర్వాయిపేట జీపీటీ పరిధి శివరాంపల్లి గ్రామస్తులు నీటికోసం అరిగోసపడుతున్నారు. గ్రామంలోని బావుల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. ఉన్న కొద్దినీరు గ్రామస్తులకు సరిపోవడంలేదు. మిషన్ భగీరథ నీరు కొందరికి అంతంత మాత్రం, మరి కొందరికి మొత్తానికే రావడంలేదు. ఇక గ్రామంలోని చేతిపంపులు పని చేయడంలేదు. ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చేతిపంపు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. ఆ చేతిపంపు రెండు నెలలుగా పని చేయడంలేదు. సంబంధిత అధికారులు మరమ్మతు చేయిండం లేదని మండిపడుతున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సరఫరాలో నిర్లక్ష్యం



గ్రామంలోని బావిలో సరిపోను నీరు ఉన్నప్పటికీ సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. రెండు గంటలు మోటార్ పెట్టి బంద్ చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం అసంపూర్తి పనులతో గ్రామంలో అందరికీ నీరు అందడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి

– చెనవేని శ్రీనివాస్, శివరాంపల్లి

మరమ్మతు చేయించాలి



గ్రామస్తులు తాగడానికి ఉపయోగిస్తున్న పాఠశాల ఆవరణలోని చేతిపంపుకు మరమ్మతు చేయించాలి. రెండు నెలలుగా చేతిపంపు పని చేయడం లేదని, రిపేరు చేయించాలని కార్యదర్శికి మొరపెట్టుకున్నా, పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు స్పందించాలి. మిషన్ భగీరథ నీరు గ్రామస్తులకు సరిపడా సరఫరా చేయాలి.

– మాదం స్వామి, శివరాంపల్లి

దళారులతో మోసపోవద్దు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ స్వప్న, తదితరులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పాత మార్కెట్ యార్డులో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న గురువారం ప్రారంభించారు. రైతులు దళారులతో మోస పోవద్దని, కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, మార్కెట్ కార్యదర్శులు మల్లేశం, రాజా, సీఈవో రవీందర్, మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఏవో ఖాదర్, అడ్తిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మామిడి తిరుపతిరెడ్డి మార్కెట్ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, హమాలీలు, నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల ప్రారంభించారు. సింగిల్ విండోతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలను ప్రారంభించగా వైస్ చైర్మన్ పిండి సత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరీష్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, నాయకులు బొమ్మరవేని తిరుపతి, పంజాల శ్రీనివాస్‌గౌడ్, తడగొండ హన్మంతు,బాపురాజు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



రామడుగు: గోపాల్‌రావుపేటలో..

సైదాపూర్: వెన్కెపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘం చైర్మన్ తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని రైతులు నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో నాయకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఖాసీంపేటలో పశు వైద్యశిబిరం





శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డీఆర్ సుధాకర్, పోచంపల్లిలో పశువులకు టీకాలు

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేటలో గురువారం పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. శిబిరాన్ని జిల్లా పశువైద్యధికారి డీఆర్ సుధాకర్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. గాలికుంటూ నివారణ టీకాలు వేయించకుంటే పాల దిగుబడి తగ్గడంతో పాటు పశువులు మృతిచెందే అవకాశం ఉందని, పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి సురేందర్‌రెడ్డి, జేవీవో అభిషేక్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని పోచంపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారులు అరవిందరెడ్డి, సుస్మితారెడ్డి గాలికుంటు వ్యాధి, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన



చిగురుమామిడి: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



బహుమతి అందజేస్తున్న ఎంఈవో వేణుకుమార్

రామడుగు: మండలంలోని గుండి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ హాజరై మాట్లాడారు. ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతోందని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చిలువేరి స్వప్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం బానోతు కిషన్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను కార్పొరేట్ స్కూళ్లకు పంపొద్దని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన లభిస్తుందన్నారు. వేడుకల్లో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రజిత, టీచర్లు స్వరూప, కదీర్‌పాషా, సునీత, వాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చొప్పదండి: ఏకాగ్రతతోనే విద్యార్థులు చదువులో రాణిస్తారని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యతో పాటు విభిన్న రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



విద్యా సామగ్రి, నిత్యావసరాలు పంపిణీ

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో ఇటుక బట్టీ కార్మికుల పిల్లలకు వేసవిలో సార్వజనిక విద్య అందించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్ తెలిపారు. ఈ మేరకు గురువారం కార్మికుల పిల్లలకు ఇటుకబట్టీ యజమానుల సహకారంతో స్పోర్ట్స్ ట్రాక్ షూ, టీ షర్టులు, విద్యా సామగ్రి, నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, వీరేశం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వచ్ఛ ఎగ్జిబిషన్

హుజూరాబాద్: పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో 19 నుంచి పర్యావరణ పరిరక్షణ, తడి, పొడిచెత్త సేకరణపై స్వచ్ఛ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని గురువారం హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. జిల్లాలోనే తొలిసారిగా ఎగ్జిబిషన్‌ను విద్యార్థులతో నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఎగ్జిబిషన్ ను విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థి టి. సిద్ధార్థ ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 12వ గ్రేడ్ చదువుతున్న విద్యార్థిని స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ జి.కాళహస్తి, శ్రీనివాస్, ప్రమోద్ రాజు, ఇనాక్, బాలసుందర్‌రావు, వంశీకృష్ణ అభినందించారు.

డిజిటల్ బోధనకు గాగిరెడ్డిపల్లి యూపీఎస్

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల డిజిటల్ పాఠ్యాంశాల బోధనకు ఎంపికైందని రాంచంద్రారెడ్డి గురువారం తెలిపారు. డిజిటల్ బోధనకు తరగతి గది సిద్ధం చేశామన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

హుజూరాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. గురువారం ఏసీపీ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల రివ్యూ మీటింగ్‌లో మాట్లాడారు. సమావేశంలో సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, వరగంటి రవి, కిషోర్, డీబీఎల్ కంపెనీ అధికారులు, ఎన్‌హెచ్ఐ అధికారులు ఉన్నారు.

ఒక్కచోట చేరిన ఆయా స్కూళ్ల విద్యార్థులు

హుజూరాబాద్: విద్యార్థులు ఇతర ప్రాంతాలు, పరిసరాలకు వెళ్లినప్పుడు కొత్త పరిజ్ఞానం లభిస్తుందని హుజూరాబాద్ ఎంఈఓ భూపతి శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూరాబాద్ జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాల, కందుగుల పాఠశాలలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్‌లో భాగంగా వివిధ పాఠశాల విద్యార్థులు ఒక దగ్గర చేరి కొత్త విషయాలు నేర్చుకున్నారని తెలిపారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విషయ పరిజ్ఞానంతో అత్యున్నత ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న గుగులోత్ రాజు

కరీంనగర్‌సిటీ: బీకాం విద్యార్థులు విషయ పరిజ్ఞానం నైపుణ్యంతో వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక రంగంలో అత్యున్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని హన్మకొండలోని పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాల కామర్స్ సహాయ ఆచార్యుడు గుగులోత్ రాజు అన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం 'కామర్స్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు' అంశంపై ఏర్పాటు చేసిన విస్తృతోపన్యాసంలో ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ఒకటని తద్వారా దేశంలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ప్రయత్నం చేయాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ విభాగాధిపతి రాజయ్య మాట్లాడుతూ అత్యున్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీజీటీఏ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సమన్వయకర్త మల్లారెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త హర్జోత్ కౌర్, కామర్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల సంఖ్య పెంచండి



వినతిపత్రం ఇస్తున్న పెటా సంఘం నాయకులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల సంఖ్యను పెంచాలని కోరుతూ గురువారం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ జిల్లాలో కేవలం 10 శిక్షణ శిబిరాలను మాత్రమే నిర్వహిస్తున్నామని, అందుకు దరఖాస్తులను అందించాలని జిల్లా క్రీడా శాఖ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో ఉన్న మండలాల సంఖ్య ఆధారంగా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు వీరన్న, మాజీ ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



నిందితుడితో ఎస్ఐ వంశీకృష్ణ, పోలీసులు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ శివారులో రైస్‌మిల్లులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన ముకేశ్ నుంచి 68 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెక్కులు పంపిణీ

హుజూరాబాద్: పేదల ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యతని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మాట్లాడారు. 183 లబ్ధిదారులకు రూ.76 లక్షల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు.

▲ **చాతినొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య**

మానకొండూర్: మండలంలోని గంగిపల్లికి చెందిన వివాహిత మార శ్యామల (38) చాతినొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంది. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి మార యాదగిరి శ్యామల దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కూతురు వివాహానికి చేసిన అప్పు తీర్చడానికి యాదగిరి దుబాయ్ వెళ్లాడు. కూతురు పెళ్లికి చేసిన అప్పుతోపాటు తనకు వైద్యం చేయిస్తే మరింత అప్పు అవుతోందని బాధపడుతుండేది. బుధవారం నొప్పి భరించలేక ఇంటిలో ఉరేసుకుందని, గురువారం దుబాయ్ నుంచి ఇంటికి చేరుకున్న మృతురాలి భర్త ఫిర్యాదుతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

▲ **ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు**

జమ్మికుంట: అజాగ్రత్తగా బస్సు నడిపిన ఆర్టీసీ డ్రైవర్‌పై గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని పాపక్కపల్లి గ్రామానికి చెందిన గొడుగు సమ్మక్క ఈ నెల 14న పాపక్కపల్లిలో బస్సు దిగకముందే డ్రైవర్ గౌస్‌పాషా బస్సు ముందుకు కదిలించాడు. దీంతో సమ్మక కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సమ్మక్క భర్త సంపత్ ఫిర్యాదుతో నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

▲ **కోతులు, కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలు**

శంకరపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో కోతులు, కుక్కల దాడిలో ఆరుగురికి గాయాలయ్యాయి. అంబాల్‌పూర్‌లో ఇద్దరిపై కుక్కలు దాడి చేయయగా కరీంపేట, మొలంగూర్, తాడికల్, ధర్మారం గ్రామాల్లో నలుగురు కోతుల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారని స్థానికులు తెలిపారు.

▲ **బిల్లులు చెల్లించే వరకు పనులు నిలిపివేయాలి**

గంగాధర: ప్రభుత్వ పాఠశాలలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించే వరకు మిగతా పనులు నిలిపివేయించాలని మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి పలువురితో కలిసి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

▲ **సుందరగిరిలో శిలాఫలకం ధ్వంసం**

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జనవరి 18న శంకుస్థాపన చేశారు. బుధవారం అర్ధరాత్రి శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల ఫిర్యాదుతో ఎస్సై శ్రీనివాస్ ఆరా తీస్తున్నారు. ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, కార్యకర్తలు కోరుతున్నారు.